క్లుప్తంగా

హెల్త్‌కేర్ కోర్సుల్లో నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

గుంటూరు ఎడ్యుకేషన్: ఎన్టీఆర్ జిల్లా నందిగామలోని కీట్స్ ట్రస్టు ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీ, యువకులకు హెల్త్‌కేర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ, ఉద్యోగావకాశాన్ని కల్పిస్తున్నట్లు సంస్థ ప్రతినిధి హరిప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ విద్యార్హతతో 19 నుంచి 30 ఏళ్ల వయసు గల అభ్యర్థులకు నందిగామలో 60 రోజుల పాటు ఉచిత భోజన, వసతి సదుపాయంతో కూడిన శిక్షణ కల్పిస్తామని పేర్కొన్నారు. హెల్త్‌కేర్, కంప్యూటర్, కమ్యూనికేషన్, లైఫ్, ఇంటర్వ్యూ స్కిల్స్‌తో పాటు స్పోకెన్ ఇంగ్లిష్, వర్క్‌ప్లేస్ ఎథిక్స్‌పై శిక్షణతో పాటు కార్పొరేట్ హాస్పిటల్స్, హెల్త్‌కేర్ సంస్థల్లో నెలకు రూ.20వేల కనీస వేతనంపై ఉద్యోగాన్ని కల్పిస్తామని తెలిపారు. వివరాలకు 90004 87423 నంబర్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

మాజీ ఎమ్మెల్యే మస్తాన్ వలి ఫేస్‌బుక్ హ్యాక్‌పై కేసు

పట్నంబజారు: మాజీ ఎమ్మెల్యే ఫేస్‌బుక్ అకౌంట్ హ్యాక్‌పై కేసు నమోదైంది. లాలాపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మాజీ ఎమ్మెల్యే షేక్ మస్తాన్‌వలి ఫేస్‌బుక్‌లోని అఫీషియల్ పేజీని గుర్తు తెలియని కొందరు హ్యాక్ చేయడంతో పాటు బ్లాక్ చేశారు. గమనించిన ఆయన లాలాపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సమ సమాజ స్థాపనకు అంబేడ్కర్ కృషి



గుంటూరు మెడికల్: సమ సమాజ స్థాపన కోసం అంబేడ్కర్ కృషి చేశారని గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ అన్నారు. సామాజిక సమాజ సంకల్పం కార్యక్రమంలో భాగంగా బుధవారం హిందూ కళాశాలలో వివిధ పోటీల్లో గెలుపొందిన ఫార్మసీ, నర్సింగ్ విద్యార్థినులకు బహుమతులను అందచేశారు. డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ అంబేడ్కర్ భావజాలాన్ని ప్రజలంతా అలవర్చుకోవాలని సూచించారు. ఈ నెల 9 నుంచి 19 వరకు విద్యార్థినులకు పోటీలు నిర్వహించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్ ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

'పచ్చ' పత్రికల్లో కథనాలు అవాస్తవం

పట్నంబజారు: తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా కుటుంబంపై వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఆరోపణలు చేసినట్లు పలు పత్రికల్లో వచ్చిన వార్తలు అవాస్తవమని వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి షేక్ గులాం రసూల్ ఖండించారు. జిన్నా టవర్ సెంటర్‌లోని ఆయన కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ నెల 16న తాము ఓ హోటల్‌లో ఏర్పాటు చేసుకున్న సమావేశంలో ఎమ్మెల్యే కుటుంబంపై ఆరోపణలు చేసినట్లు కావాలని కొంత మంది కొన్ని పత్రికల ద్వారా అవాస్తవాలు ప్రచురించారని ఆరోపించారు. కేవలం స్నేహితులతో కలిసి సరదా మాట్లాడుకుంటున్న అంశాన్ని ఎమ్మెల్యే ముస్తఫా కుటుంబీకులపై ఏదో మాట్లాడుకున్నట్లు చిత్రీకరించడం సరి కాదన్నారు. నియోజకవర్గంలో రెండు దఫాలుగా ఎమ్మెల్యేగా ఉన్న ముస్తఫాపై ఏనాడు ఒక్క అవినీతి ఆరోపణ లేదని స్పష్టం చేశారు. నియోజకవర్గ అభివృద్ధిలో తనదైన ముద్ర వేసుకున్న ఎమ్మెల్యే ముస్తఫాపై తాము ఎటువంటి వ్యాఖ్యలు చేయలేదని, పలు పచ్చ పత్రికలు అభూత కల్పనలు సృష్టించడం సబబు కాదని తెలిపారు. ఎమ్మెల్యే ముస్తఫా తన కుమార్తె షేక్ నూరిఫాతిమాను ఎన్నికల్లో నిలబెడుతున్న నేపథ్యంలో ఓర్వలేక దుష్ప్రచారం చేస్తున్నారని మండి పడ్డారు. పత్రికలు వాస్తవాలు గుర్తించి కథనాలు ప్రచురించాల్సిన అవసరం ఉందని సూచించారు.

వైభవంగా జెండా పండుగ



పొన్నూరు: మండలంలోని జడవల్లిలో గ్రామస్తుల ఆధ్వర్యంలో నూతన సంవత్సర జెండా పండుగ వేడుకను బుధవారం వైభవంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య పాల్గొని వేడుకల్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పిల్లి ఇందిరా ప్రియదర్శిని, వైఎస్సార్ సీపీ నాయకులు పిల్లి మాణిక్యారావు, రాష్ట్ర మైనారిటీ కమిషన్ సభ్యులు షేక్ సైఫుల్లా, ఏఎంసీ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, రూరల్ జేసీఎస్ కన్వీనర్ భవనం వంశీరెడ్డి, పొన్నూరు పట్టణ, రూరల్ అధ్యక్షులు మహమ్మద్, రుద్రపాటి ఆదిశేషులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పన

- పార్టీల ప్రతినిధుల సమావేశంలో కమిషనర్ కీర్తి చేకూరి
- ఓటర్ల తుది జాబితా 22న విడుదల



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ ఈఆర్‌వో కీర్తి చేకూరి తెలిపారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో బుధవారం ఎన్నికల సంఘం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటర్ల జాబితా స్పెషల్ సమ్మరీ రివిజన్ -2024పై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు గుంటూరు తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లోని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల ఏర్పాటుపై చర్యలు తీసుకోవడానికి ఏఈల వారీగా కేంద్రాల్ని పరిశీలించి నివేదిక ఇవ్వాలని ఆదేశించామని తెలిపారు. ఓటర్ల డ్రాఫ్ట్ నోటిఫికేషన్‌పై వివిధ రాజకీయ పార్టీలు, ప్రజల నుంచి గత డిసెంబర్ 9 నాటికి అందిన ఫిర్యాదులు, అభ్యంతరాల్ని పరిష్కరించామని పేర్కొన్నారు. తుది జాబితా ఈ నెల 22న కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేస్తుందని వెల్లడించారు. సమావేశంలో పశ్చిమ నియోజకవర్గ ఈఆర్‌వో, అదనపు కమిషనర్ కె.లక్ష్మీ శివజ్యోతి, ఏఈఆర్‌వోలు సీహెచ్.శ్రీనివాస్, బి.శ్రీనివాసరావు, సూపరింటెండెంట్లు సాంబశివరావు, పద్మ, డెప్యూటీ తహసీల్దార్ బి.భాస్కర్, టీడీపీ నుంచి ఓంకార్, వైఎస్సార్ సీపీ నుంచి డి.జానీ బాషా, బీఎస్పీ నుంచి సీహెచ్.వాసు, బీజేపీ నుంచి ఆర్.భాస్కరరావు, ఆమ్ ఆద్మీ నుంచి సేవకుమార్, కాంగ్రెస్ నుంచి డి.బాలాస్వామి, సీపీఎం నుంచి షేక్ ఖాసిం షాహెద్ పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ జయప్రదం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్, సంఘాల నాయకులు

నెహ్రూనగర్: విజయవాడ స్వరాజ్ మైదానంలో శుక్రవారం జరగనున్న అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు ప్రతి ఒక్కరూ హాజరై జయప్రదం చేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్ పిలుపునిచ్చారు. అరండల్‌పేటలోని ఓ హోటల్‌లో బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం వైఎస్. జగన్ మోహన్‌రెడ్డి చేతుల మీదుగా దేశంలో అత్యంత ఎత్తైన 206 అడుగుల అంబేడ్కర్ విగ్రహంతో పాటు, స్మృతి వనం, గ్రంథాలయం, ఆయన జీవిత చరిత్రను తలిపించే విధంగా చిత్రాల ప్రదర్శన ఏర్పాటు చేయడం అభినందించదగ్గ విషయమని పేర్కొన్నారు. మాల ఐక్య సేవా సమతి వ్యవస్థాపక అధ్యక్షులు బండ్లమూడి స్టాలిన్‌బాబు మాట్లాడుతూ విగ్రహావిష్కరణకు హాజరయ్యే వారి కోసం ప్రత్యేక బస్సు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు నల్లపు నీలాంబరం, మేడిద బాబూరావు, తన్నీరు సాంబయ్య, వినయ్, వాసు పాల్గొన్నారు.

సామాజిక న్యాయం అమలులో దేశానికే ఆదర్శం

పట్నంబజారు: సామాజిక న్యాయం అమలులో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి దేశానికే ఆదర్శమని ప్రభుత్వ సలహాదారులు బత్తుల బ్రహ్మానందరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడలో ఈనెల 19న జరగనున్న అంబేడ్కర్ విగ్రహావిష్కరణ మహోత్సవాన్ని సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించనున్న నేపథ్యంలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ప్రపంచంలోనే అతి పెద్దదైన 206 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని తీర్చిదిద్దారని తెలిపారు. దేశ చరిత్రలోనే విగ్రహావిష్కరణ చరిత్రలో నిలిచిపోతుందని పేర్కొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ అభినందనీయం

నెహ్రూనగర్: అంబేడ్కర్ విగ్రహాన్ని ప్రపంచంలో అత్యంత ఎత్తులో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయడం అభినందనీయమని ఇద్వా (ఐడియల్ దళిత్ ఉమెన్ అసోసియేషన్) వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ గోళ్లమూడి రాజసుందరబాబు పేర్కొన్నారు. విగ్రహావిష్కరణలో అన్ని పార్టీల వారితో పాటు కులాలు, మతాలకు అతీతంగా అందరినీ భాగస్వామ్యం చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

మహాప్రస్థానానికి విరాళం



గుంటూరు ఎడ్యుకేషన్: బొంగరాలబీడులోని మహాప్రస్థానంలో సదుపాయాల కల్పనకు దాతలు రూ.2,01,116 విరాళాన్ని అందజేశారు. కమిటీ సభ్యులకు దాతలు చెరుకూరి చినమాల కొండయ్య సతీమణి చెన్నమ్మ, శ్రీనివాసరావు సతీమణి శ్రీలక్ష్మి సంబంధిత మొత్తాన్ని బుధవారం చెక్కు రూపంలో ఇచ్చారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షుడు యార్లగడ్డ అంకమ్మ చౌదరి మాట్లాడుతూ మహా ప్రస్థానం అభివృద్ధికి దాతలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ కోశాధికారి లంకా విజయసారథి, సభ్యులు కల్లూరు రమణయ్య, జంగాపల్లి పార్థసారథి, ధనియాల గాంధీ, కూనల మాలకొండయ్య పాల్గొన్నారు.

22న కోటి ఒక్క లింగాల శివాలయం ప్రారంభం

పాత గుంటూరు: ఫిరంగిపురం మండలం వేమవరంలో ఈ నెల 22న కోటి ఒక్క లింగాల శివాలయ ప్రారంభోత్సవాన్ని నిర్వహిస్తున్నామని అమ్మ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు స్వామి జ్ఞానప్రసన్న గిరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సుమారు ఎనిమిది విస్తీర్ణంలో 101 అడుగుల మహాశివలింగంతోపాటు 50 అడుగుల మహానందీశ్వరుడు, కోటి ఒక్క లింగాలతో దేవాలయాన్ని నిర్మించినట్లు పేర్కొన్నారు. ఇందులో హుండీ, అభిషేకం టికెట్లు, వీఐపీ సౌకర్యాలు ఉండవని వెల్లడించారు. అయోధ్యలోని రామ మందిర ముహూర్తానికే ఆలయం ప్రారంభోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ దేవాలయానికి అనుబంధంగా భవిష్యత్తులో ఎన్నో సేవలు అందుబాటులోకి తేవాలనే సంకల్పంతో ఉన్నామని పేర్కొన్నారు. ఈ మహా క్రతువులో ఎందరో పుణ్యాత్ములు భాగస్వాములయ్యారని తెలిపారు. మంత్రులు, శాసన సభ్యులు, ప్రముఖుల్ని ప్రారంభోత్సవానికి ఆహ్వానించామన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులంతా పాల్గొనాలని స్వామి జ్ఞానప్రసన్న గిరి కోరారు.

హాస్యానికి మారుపేరు జంధ్యాల



జంధ్యాల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న అవగాహన సంస్థ సభ్యులు

లక్ష్మీపురం: హాస్యానికి మారుపేరు జంధ్యాల అని మధుమేహ వ్యాధి నిపుణులు డాక్టర్ వి.వి.రామ్‌కుమార్, అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి పేర్కొన్నారు.

అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో బుధవారం జంధ్యాల జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ రామ్‌కుమార్ మాట్లాడుతూ జంధ్యాల హాస్యాన్ని ఆయుధంగా నమ్మి, దాన్ని ఆరోగ్యవంతంగా తన చిత్రాల్లో చూపించి మెప్పు పొందారని తెలిపారు. అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి మాట్లాడుతూ మొదటి నుంచి జంధ్యాల హాస్య ప్రియుడని, ఆయన రాసిన నాటకాలు, ఇతర రచనలన్నీ హాస్య ప్రధానమైనవని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు, విశ్రాంత ఇంజినీర్ పి.ఘనశ్యామాచార్యులు పాల్గొన్నారు.

అనుమతులు లేకుండా విగ్రహం ఏర్పాటుపై ఆందోళన



విగ్రహం వద్ద పోలీసుల బందోబస్తు

పట్నంబజారు: నిబంధనలకు విరుద్ధంగా విగ్రహం ఏర్పాటుపై ఘర్షణ నెలకొంది. స్థానికులు, పోలీసులు తెలిపిన సమాచారం మేరకు... మంగళదాస్ నగర్‌లోని రిలయన్స్ మార్ట్ పక్కన అనుమతులు తీసుకోకుండా మంగళవారం రాత్రి ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. అయితే దాన్ని ఆనుకుని గత దశాబ్దంగా ఆగస్టు 15, రిపబ్లిక్ డేలకు సంబంధించి జాతీయ జెండా దిమ్మె ఉంది. జాతీయ జెండాను అవమానించేలా విగ్రహాన్ని ఏర్పాటు చేశారంటూ స్థానికులు విగ్రహావిష్కరణ కుదరదని ఆందోళనకు దిగారు.. అయితే, విగ్రహం ఎవరు ఏర్పాటు చేశారనే విషయం తెలియరాలేదు. టీడీపీ నేత నసీర్ అహ్మద్‌తో పాటు, కొంత మంది నేతలు అక్కడకు చేరుకుని విగ్రహావిష్కరణ చేస్తామని స్థానికులతో ఘర్షణకు దిగారు. విషయం తెలుసుకున్న ఈస్ట్ ఇన్‌చార్జి డీఎస్పీ బాలసుందరరావు, పాత గుంటూరు సీఐ ఎం.వి.సుబ్బారావు, పోలీసు అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని చక్కబెట్టారు. అనుమతులు లేకుండా విగ్రహావిష్కరణ చేయడం సరైంది కాదని టీడీపీ నేతలకు స్పష్టం చేశారు. పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

వాలీబాల్ పోటీల్లో వేజండ్ల హైస్కూల్ జట్టు ప్రతిభ



వేజండ్ల (చేబ్రోలు): వాలీబాల్ పోటీల్లో వేజండ్ల హైస్కూల్ బాలికల జట్టు ప్రతిభ చూపింది. సంక్రాంతి సంబరాల సందర్భంగా వట్టిచెరుకూరు మండలం వింజనంపాడులో 14 నుంచి 16వ తేదీ వరకు రాష్ట్రస్థాయి మహిళల వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఇందులో వేజండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన బాలికల జట్టు ద్వితీయ స్థానం సాధించింది. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులను హెచ్‌ఎం టి. విజయశ్రీ, పీఈటీ తిరుమలశెట్టి వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందించారు.

ఉత్కంఠభరితంగా క్రికెట్ పోటీలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న తహసీల్దార్ సుభాని, ఎంపీడీవో రాజగోపాల్, ఎస్ఐ అబ్దుల్

పెదనందిపాడు: ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీల్లో భాగంగా క్రికెట్ పోటీలు ఉత్కంఠభరితంగా జరుగుతున్నాయి. స్థానిక పెదనందిపాడు ఆర్ట్స్ అండ్ సైన్సెస్ కళాశాల క్రీడా ప్రాంగణంలో బుధవారం మధ్యాహ్నం పలు జట్ల మధ్య పోటీలు జరిగాయి. అన్నవరం - పెదనందిపాడు-1 జట్ల మధ్య పోటీలో అన్నవరం జట్టు గెలిచింది. రావిపాడు - పుసులూరు జట్ల మధ్య పోటీలో పుసులూరు, పెదనందిపాడు-2 - అబ్బినేనిగుంటపాలెం మధ్య పోటీలో పెదనందిపాడు-2 జట్టు గెలిచింది. ముందుగా క్రీడాకారుల్ని ఎంపీడీవో రాజగోపాల్, తహసీల్దార్ సుభాని, ఎస్ఐ అబ్దుల్ రెహమాన్ పరిచయం చేసుకున్నారు. గ్రామీణ క్రీడాకారుల్లో నైపుణ్యాల్ని వెలికి తీయడానికే ప్రభుత్వం క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రాజగోపాల్ తెలియజేశారు. పలు పాఠశాలల ఉపాధ్యాయులు అంపైర్లుగా వ్యవహరించారు.

భూ సమస్యల పరిష్కారానికే రీ సర్వే



సర్వేను ప్రారంభిస్తున్న ఎమ్మార్వో సాంబశివరావు, జెడ్పీటీసీ సభ్యుడు తుమ్మల సుబ్బారావు తదితరులు

గుంటూరు రూరల్: గ్రామాల్లో రెవెన్యూ సమస్యల పరిష్కారానికే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భూముల రీ సర్వే కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని గుంటూరు వెస్ట్ తహసీల్దార్ సాంబశివరావు తెలిపారు. మండలంలోని చిన్నపలకలూరులో బుధవారం పొలాల రీసర్వేను ఆయన జెడ్పీటీసీ సభ్యుడు తుమ్మల సుబ్బారావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మార్వో మాట్లాడుతూ గ్రామాల్లో ఏళ్ల తరబడి రైతులు పడుతున్న రెవెన్యూ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు. జెడ్పీటీసీ సభ్యుడు సుబ్బారావు మాట్లాడుతూ ప్రతి సమస్యకు ఇంటిముందే పరిష్కారం చూపిన ఏకైక నాయకుడు మన జగనన్న అని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్వేయర్ సాంబశివరావు, వీఆర్వో ప్రసన్నకుమార్, గ్రామ సర్వేయర్లు శ్రీనివాస్, విజయ్‌కుమార్‌రెడ్డి, ఎం. వెంకటేశ్వర్లు, రైతులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు అండాదండ

- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని
- త్రోబాల్ క్రీడాకారిణి చల్లా కల్పనను ఆదుకుంటాం
- ఆర్థిక సాయం అందజేత



కల్పనకు ఆర్థిక సాయం అందజేస్తున్న మంత్రి రజిని

పట్నంబజారు: గుంటూరు జేకేసీ కళాశాల విద్యార్థిని, పేదింట క్రీడా కుసుమం చల్లా కల్పనను అన్ని విధాలుగా ఆదుకుంటామని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని భరోసానిచ్చారు. జాతీయస్థాయిలో సత్తా చాటి, సౌత్ వెస్ట్ ఆసియన్ త్రోబాల్ చాంపియన్ షిప్ పోటీలకు భారతదేశం తరఫున ఎంపికైన కల్పనకు బుధవారం కొరిటెపాడు ప్రధాన రహదారిలోని కార్యాలయంలో మంత్రి ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి రజిని మాట్లాడుతూ రాష్ట్రానికి ఎన్నో విజయాలు అందించిన కల్పన జాతీయ జట్టుకు ఎంపికై అంతర్జాతీయ స్థాయిలో కూడా సత్తా చాటే అవకాశాన్ని పొందడం సంతోషదాయకమని తెలిపారు. వచ్చే నెలలో దుబాయ్‌లో జరిగే సౌత్‌వెస్ట్ ఆసియన్ త్రోబాల్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికవ్వడం రాష్ట్రానికే గర్వకారణమని పేర్కొన్నారు. అంతర్జాతీయ వేదికకు వెళ్లి ఆడాలంటే ఎంతో ఖర్చుతో కూడుకున్న వ్యవహారమని, ఆర్థిక సాయం అందించడం తమ బాధ్యతని స్పష్టం చేశారు. పేద కుటుంబానికి చెందిన విద్యార్థి కల్పన ప్రతిభను తల్లిదండ్రులు గుర్తించి ప్రోత్సహిస్తున్నారని, ఇది అందరికీ ఆదర్శనీయమని పేర్కొన్నారు. ఏపీ ప్రభుత్వం రాష్ట్రంలోని ప్రతిభావంతులైన క్రీడాకారులందరికీ అండగా ఉంటోందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతుల్ని వెలికితీసేందుకే, రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్ర లాంటి అతి పెద్ద కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని మంత్రి చెప్పారు. ఈ కార్యక్రమం ద్వారా మట్టిలో మాణిక్యాలను వెలుగులోకి తీసుకొస్తామని, కల్పన భవిష్యత్తులో మరింత కృషితో మంచి స్థానాన్ని సంపాదించుకోవాలని ఆకాంక్షించారు.

జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరం

నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న నూరిఫాతిమా



జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపు పరిశీలిస్తున్న మేయర్ కావటి

పట్నంబజారు: జగనన్న ఆరోగ్య సురక్ష మొదటి, రెండోవ విడత కార్యక్రమాలకు విశేష స్పందన లభిస్తోందని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరి ఫాతిమా తెలిపారు. నియోజకవర్గంలోని 53, 6వ డివిజన్ల పరిధిలోని వెంగళరావునగర్, పలు ప్రాంతాల్లో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో బుధవారం ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదలకు వైద్యాన్ని చేరువ చేసిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని పేర్కొన్నారు. కార్పొరేట్ వైద్యాన్ని పేదల గడప వద్దకు చేర్చిన ఘనత ఆయనదేనని తెలిపారు. రానున్న ఎన్నికల్లో మరోమారు జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని నూరి ఫాతిమా తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ధూపాటి వంశీ, వైఎస్సార్ సీపీ నేతలు ధూపాటి సాల్మాన్, అనిల్, మహేష్, రవిరాజ్, జాఫర్‌ఖాన్, జిలానీ, షరీఫ్ పాల్గొన్నారు.

ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా మార్చడమే లక్ష్యం: మేయర్

నెహ్రూనగర్: ఆంధ్రప్రదేశ్‌ను ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా మార్చడమే సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు పేర్కొన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టి ప్రజలందరికీ ఆరోగ్య భరోసా కల్పిస్తున్నారని తెలిపారు. గుంటూరు నగరంలోని ఆర్.అగ్రహారం వద్ద బుధవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో సీఎం వైఎస్. జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి పేదల అభివృద్ధికి, సంక్షేమానికి కృషి చేస్తున్నారని కొనియాడారు. ముఖ్యంగా విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పుల్ని తెచ్చారన్నారు. నగరంలోని 29 వైయస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో మెడికల్ క్యాంప్‌లు జరుగుతున్నాయని తెలిపారు. రోగులకు అవసరమైతే అందుబాటులోని హాస్పిటల్లో చేర్పించి మెరుగైన చికిత్స అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ అధికారులు, సిబ్బంది, డాక్టర్లు, పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

అందుబాటులో రైల్వే పశ్చిమ విభాగం సేవలు

నూతన ప్లాట్‌ఫారం వైపు రిజర్వేషన్ కౌంటర్లు ఏర్పాటు



అవార్డులు అందుకున్న అధికారులతో డీఆర్‌ఎం రామకృష్ణ, ఏడీఆర్‌ఎం సైమన్

లక్ష్మీపురం: గుంటూరు రైల్వే పశ్చిమ విభాగం అరండల్‌పేట వైపు 8వ ప్లాట్‌ఫారం నిర్మాణ పనుల్ని పూర్తి చేసి ప్రయాణికులకు సేవల్ని ప్రారంభించినట్లు డివిజన్ డీఆర్‌ఎం రామకృష్ణ బుధవారం వెల్లడించారు. నూతన ప్లాట్‌ఫారం వైపు కౌంటర్లను, రిజర్వేషన్ కార్యాలయం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. టికెట్లు పొందడానికి పశ్చిమం అరండల్‌పేట వైపు ఐదు బుకింగ్ కౌంటర్లు అందుబాటులో ఉన్నాయని తెలియజేశారు. స్టేషన్‌లోని వివిధ ప్లాట్‌ఫారాలకు చేరుకోవడానికి ప్రయాణికులు లిఫ్ట్, ఎఫ్‌వోబీ సబ్‌వేలను ఉపయోగించవచ్చని సూచించారు. పశ్చిమ విభాగం అరండల్‌పేట వైపు కూడా సేవల్ని ప్రారంభించడం వల్ల నగరవాసులకు ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. రైల్వే స్టేషన్‌లో పశ్చిమ నుంచి తూర్పు విభాగం వైపునకు వచ్చేందుకు ప్రయాణికులకు సౌకర్యాలు కూడా కల్పించామన్నారు. అరండల్‌పేట వైపు కూడా స్టేషన్‌లోకి రావచ్చని ఆయన తెలియజేశారు.

13 మందికి రైల్ సేవా పురస్కార్ అవార్డులు

దక్షిణ మధ్య రైల్వే గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో వివిధ విభాగాల అధికారులు రైల్ సేవా పురస్కార్ అవార్డులు దక్కించుకోవడం అభినందనీయమని డివిజన్ డీఆర్‌ఎం రామకృష్ణ పేర్కొన్నారు. పట్టాభిపురంలోని తన కార్యాలయంలో బుధవారం సాయంత్రం ఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయన మాట్లాడారు. 2023లో ప్రతిభను కనబర్చినందుకు గానూ 13 మంది 68వ రైల్వే వీక్ (రైల్ సేవా పురస్కార్) అవార్డులను అందుకున్నట్లు తెలిపారు. ఇందులోఓ ప్రధానంగా ఏడీఎఫ్‌ఎం-1 గుంటూరు ఎం.షణ్ముఖేశ్వరరావు, డివిజనల్ రైల్వే హస్పిటల్ ఏసీఎంఎస్ డాక్టర్ సీహెచ్. శ్రీనివాస్‌లతో పాటు మరో 11 మంది సంబంధిత విభాగాధికారులు ఉన్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏడీఆర్‌ఎం కె.సైమన్, చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ ప్రభాకర్ రాజు, సీనియర్ డీపీవో షాహబాజ్ హనూర్ పాల్గొన్నారు.

భళా.. బాల గాయకా !


- గుంటూరుకు చెందిన బుడతడి ప్రతిభ
- ఐదు నిమిషాల వ్యవధిలో 12 సరళీ స్వరాల ఆలాపన
- నాలుగేళ్ల వయసులోనే ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం
- ఫాస్టెస్ట్ కిడ్‌గా నిలిచిన తన్విక్ వేదాన్ష్ రెడ్డి



ఫాస్టెస్ట్ కిడ్ రికార్డుతో తన్విక్ వేదాన్ష్‌రెడ్డి

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు నగరానికి చెందిన ఓ చిన్నారి నాలుగేళ్ల చిరుప్రాయంలోనే ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లోకి ఎక్కాడు. కర్ణాటక సంగీతంలో 12 సరళీ స్వరాల్ని ఐదు నిమిషాల 21 సెకండ్లలో ఆలపించడం ద్వారా అతి చిన్న వయసులో ఫాస్టెస్ట్ కిడ్‌గా నిలిచి, సరికొత్త రికార్డు నెలకొల్పాడు. నగరంలోని దేవాపురానికి చెందిన మాలపాటి విష్ణు ప్రణీత్‌రెడ్డి, ప్రణతి తనయుడు తన్విక్ వేదాన్ష్ రెడ్డి కర్ణాటక సంగీతం వోకల్ (గాత్రం) సాధన చేస్తున్నాడు. చిరుప్రాయంలోనే అతనికి గల ఆసక్తితో తల్లిదండ్రులు ప్రోత్సహించారు. ఇటీవల కర్ణాటక సంగీతంలో 12 సరళీ స్వరాలను అతి తక్కువ సమయంలోనే ఆలపించిన చిన్నారిగా నిలిచిన తన్విక్ వేదాన్ష్ రెడ్డికి ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం కల్పించిన నిర్వాహకులు ఫాస్టెస్ట్ కిడ్ రికార్డును ప్రదానం చేశారు. దీంతో పాటు బంగారు పతకం, సర్టిఫికెట్‌ను అందజేశారు.

ప్రేక్షకులను అలరిస్తున్న నాటికలు



జరుగుతున్న కథ నాటికలోని సన్నివేశం

కొల్లిపర: సంక్రాంతి సంబరాలను పురస్కరించుకుని కొల్లిపరలోని అవుతు రామిరెడ్డి జూనియర్ కళాశాలలోని అన్నపరెడ్డి శివరామిరెడ్డి స్మారక కళా ప్రాంగణంలో ప్రదర్శిస్తున్న నాటికలు అలరిస్తున్నాయి. హైదరాబాద్‌కు చెందిన బుల్లితెర నటులు శాస్త్రి, మల్లాది భాస్కర్ ప్రదర్శించిన వెన్నెలొచ్చింది హాస్య నాటిక, గుంటూరు అమృత లహరి థియేటర్ ఆర్ట్స్ ప్రదర్శించిన నాన్న నేనొచ్చేస్తా, తాడేపల్లి అరవింద ఆర్ట్స్ ప్రదర్శించిన జరుగుతున్న కథ నాటికలు ప్రేక్షకులను అలరించాయి. కళాకారులను శ్రీ కళానిలయం అధ్యక్షుడు జొన్నల అమ్మిరెడ్డి, కార్యదర్శి బొమ్మారెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు ఆరిమండ శివశంకర్‌రెడ్డి, భీమవరపు శివకోటిరెడ్డి, జొన్నల శ్రీనివాసరెడ్డి, అన్నవరపు రమేష్, గ్రామ ఉపసర్పంచ్ అవుతు కృష్ణారెడ్డి, కూరపాటి రవిశేఖర్‌రెడ్డి సన్మానించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రముఖ కాంట్రాక్టర్ గుదిబండి చిన వెంకటరెడ్డి, వంగా లక్ష్మారెడ్డి, బొల్లిముంత కృష్ణ, పోతిరెడ్డి పాల్గొన్నారు.